మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# ప్రశాంత వాతావరణంలో హోలీ పండుగను నిర్వహించుకోవాలి

**లోతట్టు ప్రదేశాల్లో, చెరువుల వద్దకు వెళ్లరాదు..చిన్నపిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలి..**

**మద్యం సేవించి వాహనాలు నడపరాదు: జిల్లా ఎస్పీ రక్షిత కె.మూర్తి**



**వనపర్తిటౌన్, మార్చి 24, ప్రభాతవార్త :** హోలీ పండుగను వనపర్తి జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరూ పండుగను సాంప్రదాయాల నడుమ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించుకోవాలన్నారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలను నడపడం చేయడం చట్టరీత్యా నేరమని తెలియజేశారు. జిల్లా ప్రజలు సురక్షితమైన రంగులను వాడి పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. యువత హోలీ పండుగ అనంతరం చెరువుల్లో లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా యువత తల్లిదండ్రులు పిల్లల కార్యక్రమాలను గమనిస్తూ వారికి సరైన పద్ధతిని తెలియజేయాలని సూచించారు. వాహనాలు నడిపే క్రమంలో అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, లాంటి చర్యలను యువత మానుకోవాలని సూచించారు.

## మన్యంకొండలో ఘనంగా

# ధ్వజారోహణం

**వైభవంగా దేవతా ఆహ్వానం**

**నేడు అలివేలు మంగతాయారు**

**తిరు కళ్యాణ మహోత్సవం**



అలంకరణలో శ్రీ అలివేలు మంగతాయారు అమ్మవారు

**దేవరకద్ర,మార్చి 24 ప్రభాతవార్త :** మన్యంకొండ శ్రీ అలివేలు మంగతాయారు దేవస్థానంలో ఆదివారం అమ్మవారి ధ్వజారోహణం పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈనెల 23న అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగానే ఉత్సవాల రెండోరోజు ఈ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే దేవస్థానంలో దేవతా ఆహ్వానం పూజా కార్యక్రమాన్ని కూడా పురోహితులు సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో అమ్మవారి సన్నిధిలో పూజా కార్యక్రమాలను ఆనవాయితీ ప్రకారం నిర్వహించారు.ఉత్సవాలసందర్భంగా అమ్మవారిని బంగారుఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు.వివిధరకాల పూలతో అలంకరించి ప్రత్యేకఅభిషేకాలు,అర్చనలు నిర్వహించారు. దీంతో అమ్మవారు అలంకరణలో భక్తకోటికి దర్శనమిచ్చారు. అలాగే దేవస్థానం ముందున్న దేవగుండు పక్కనున్న పుట్టనుండి ప్రత్యేక మట్టిని తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, రాధాకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్యలతో పాటు అర్చకుల బృందం, పర్యవేక్షకుడు ముత్యానంద చారి, సిబ్బంది, సుదర్శన్‌గౌడ్, నారాయణరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**నేడు అలివేలు మంగతాయారు తిరు కళ్యాణ మహోత్సవం...**



మన్యంకొండలో పుట్ట మట్టిని తీసుకువస్తున్న పురోహితులు

మన్యంకొండలో శ్రీ అలివేలు మంగతాయారు దేవస్థానంలో సోమవారం అమ్మవారి తిరుకళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉత్సవాలలో భాగంగా ఈ ప్రధాన ఘట్టాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ముందున్న కళ్యాణ మండపంలో అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కళ్యాణ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుండి కొన్ని వేల మంది భక్తులు అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి మన్యంకొండకు హాజరవుతారు. దీనికిగాను దేవస్థానం వద్ద పక్షులకు తగ్గట్టు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

# హోలీ..రంగుల కేళీ



- **చిన్నా పెద్దతేడా లేకుండా సంబురాలు**
- **రంగుల అమ్మకాలతో సందడి**
- **పిల్లల విషయంలో జాగ్రత్తలు అవసరం**
- **సహజ రంగులనే వాడాలంటున్న నిపుణులు**



మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 24, ప్రభాతవార్త : చిన్నా పెద్ద తేడా లేకుండా సరదాగా సంతోషంగా జరుపుకునే పండుగ హోలీ. రంగులతో ఆటలు ఆడుతూ డీజే శబ్దాలతో డ్యాన్సులు చేస్తూ పండుగను ఉత్సాహంగా జరుపుకొంటారు. హోలీ వేడుకలకు ఉమ్మడి పాలమూరు ముస్తాబైంది. దుకాణాల్లో రంగులు, చిన్నారులను ఆకట్టుకునేలా వివిధ రకాల కలర్ గన్స్ ఏర్పాటు చేయడంతో జోరుగా విక్రయాలకు సాగాయి.

హోలీ అంటే అగ్ని లేదా అగ్నితో పునీతమైనదని అర్థం. హోలీని హోలీకాపూర్ణిమా కూడా వ్యవహరిస్తారు. ఈ పండుగ సత్య యుగం నుంచి జరుపుతున్నట్లు పురాణాలు చెబుతున్నాయి. ఏటా ఫాల్గుణ మాసంలో పౌర్ణమి రోజున వచ్చే ఈ పండుగను హోలీ కాముని పున్నము, డోలికోత్సవం అని కూడా పిలుస్తారు. గత అయితే ఈ పండుగ గురించి భిన్న కథనాలు, కథలు ప్రచారంలో ఉన్నాయి.



**హోలీ వేడుకల్లో చల్లా వంశీచంద్‌రెడ్డి కుటుంబ సభ్యులు**

సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి హోలీ వేడుకలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి రంగులను కొనుగోలు చేశారు. హోలీ పండుగను జాగ్రత్తగా సహజ రంగులతో జరుపుకోవాలని కోరారు.

### పండుగ నేపథ్యం..

రాక్షస రాజు హిరణ్యకశపుడి కుమారుడు ప్రహ్లాదుడు నిత్యం విష్ణుమూర్తిని స్మరిస్తుంటాడు. అది హిరణ్యకశపుడికి నచ్చదు. అయితే ఎలాగైనా ప్రహ్లాదుడిని మట్టుబెట్టాలని అనుకుని రాక్షస సోదరి హోళికను పిలుస్తాడు. ఆమె శక్తులతో ప్రహ్లాదుడిని మంటల్లో దహనం చేయాలని ఆజ్ఞాపిస్తాడు. ప్రహ్లాదుడితో ఆమె మంటల్లో దూకగా విష్ణు భక్తితో మాయతో ప్రహ్లాదుడి మంటల నుంచి ప్రాణాలతో బయటపడగా, హోళిక మాత్రం నిప ్పల్లో బూడిదవుతుంది. రాక్షసి దహనమైన రోజునే హోలీ పండుగ చేస్తారు. అందుకే రాత్రి దహనం నిర్వహిస్తారు.

హోలీ ప్రాశస్త్యం శివపురాణంలో కామదహనం పేరుతో ఉన్నది. తారకాసుర సంహారం కోసం దేవతల కోరిక మేరకు మన్మథుడు శివుడి తపస్సును భగ్నం చేసి త్రినేత్రాగ్నికి బలవుతాడు. రతీదేవి కోరిక మేరకు శివుడి ద్వారా మన్మథుడు మళ్లీ బ్రతికిన సందర్భమే పండుగ. పిల్లలకు బాలారిష్టాలు పోవాలంటూ దిష్టి పోవాలంటూ హోలీకి ముందురోజు కుడుకలు, చక్కెరబిల్లలు, మాలలు మెడలో ఉంచి వీధుల్లో మంటలు ఏర్పాటు చేసి దాని చుట్టూ తిప్పుతూ కామదహన ఘట్టం నిర్వహిస్తారు.

### సందడిగా మార్కెట్లు

హోలీ పండుగ సందర్భంగా మార్కెట్లు సందడిగా మారాయి. రంగులతోపాటు వివిధ రకాల ఆకారాలు, వివిధ ధరల్లో చిన్నారులను ఆకర్షించేలా కలర్‌గన్స్ విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. రంగులు చల్లుకొనే కలర్ గన్స్ రూ.10నుంచి 300వరకు వివిధ ధరల్లో అందుబాటులో ఉన్నాయి.

**సహజ రంగులే ముద్దు.. ఆరోగ్యకరం**

హాలీ అనగానే మార్కెట్లో లభించే వివిధ రకాల రంగులను సేకరించి పండుగ జరుపుకోవడం సహజంగా జరుగుతుంది. అయితే ఆ రంగుల్లో వివిధ రకాల రసాయనాల వల్ల పిల్లల ఆరోగ్య విషయంలో ఇబ్బందులు ఏర్పడుతాయంటున్నా వైద్యులు. కెమికల్స్ కలిసి రంగులు కళ్లలోపడితే కంటి చూపునకు ప్రమాదం ఏర్పడే లేకపోలేదంటున్నారు. అయితే రసాయనాల రంగుల స్థానంలో ఇంట్లోనే లభించే సహజ రంగులను ఉపయోగించాలని చెబుతున్నారు. గోరింటాకు పొడితో గ్రీన్ కలర్, బీట్‌రూట్‌తో మెరూన్, పర్పుల్ కలర్, ఎండిన నారింజ తొక్కతలో ఆరంజ్ కలర్, ఇంట్లో లభించే పుసుపు ఇలా సహజమైన రంగులతో పండును సంతోషంగా ఆరోగ్యంగా జరుపుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



వాకర్స్‌తో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

# పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

**నన్ను ఆశీర్వదించండి...ఎంపీగా గెలిపించండి**

**సొంత జిల్లాపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి**

**సిడబ్ల్యుసికి ప్రత్యేక ఆహ్వానితుడు, మహబూబ్‌నగర్**

**ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి**

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 24 ప్రభాతవార్త : కాంగ్రెస్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ పార్టీ అభ్యర్థిగా రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని చల్లా వంశీచంద్‌రెడ్డి మహబూబ్‌నగర్ ప్రజలను కోరారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బిఎడ్ కళాశాలతో పాటు ఎంవిఎస్ కళాశాల మైదానంలో మార్నింగ్‌వాక్ సందర్భంగా ఆయన టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ఎన్‌పి వెంకటేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్‌తో కలిసి వాకర్స్‌ను కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. కాసేపు వాకర్స్‌తో మాట్లాడారు. వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వాకర్స్ ఉదయం, సాయంత్రం వేళ చీకటి సందర్భంగా కాస్త ఇబ్బందికరమైన పరిస్థితి ఎదుర్కొంటున్న విషయాన్ని వారు వంశీ దృష్టికి తీసుకొని వెళ్లారు. వెంటనే స్పందించి ఆయన మహబూబ్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్‌కు చెప్పగా వీలైనంత త్వరగా మైదానంలో లైట్లు ఏర్పాటు చేస్తానని తెలిపారు. యోగా చేస్తున్న కొందరిని పలకరించి,యోగా షెడ్ లేకుండా యోగా ఎలా చేస్తున్నారని ఆరా తీశారు. షెడ్ నిర్మాణం కోసం గత..

-మిగతా2లో..

# షటిల్ ఆడి.. వ్యాయామం చేసి..

**ప్రచారంలో తనదైన శైలిలో దూసుకెళ్తున్న అరుణమ్మ**

**బాలుర కళాశాల గ్రౌండ్స్‌లో వాకర్స్‌ను పలకరిస్తూ కరపత్రాలు పంపిణీ**

**మన ఓటు మోడీ కోసం దేశం కోసం అంటూ పిలుపు**

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 24 ప్రభాతవార్త : ఎన్నికల ప్రచారంలో తనదైన శైలిలో దూసుకుపోతున్నారు బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు మహబూబ్‌నగర్ ఎంపి అభ్యర్థి డికె అరుణ. పాలమూరు ప్రజలను ఉదయాన్నే ఆప్యాయంగా పలకరిస్తూ నేను మీ అరుణమ్మని ఈసారి నాకు సపోర్టు ఇవ్వండి సేవ చేసుకుంటానంటూ మహబూబ్‌నగర్ వాసులతో మమేకం అవుతున్నారు. ఆదివారం ఉదయం మహబూబ్‌నగర్‌లోని బాలుర కళాశాల గ్రౌండ్స్‌లో వాకర్స్‌ను, మహిళలను, చిన్నారులను పలకరిస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనను మహబూబ్‌నగర్ ఎంపిగా గెలిపించండి, పాలమూరుకు సేవా చేసుకుంటాను అంటూ స్థానిక బిజెపి నేతలతో కలిసి వాకర్స్, యువత, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ మద్దతు పలికారు. మాటల వాగ్దాటితో రాజకీయాల్లో తనకంటూ ఓ క్రేజ్ తెచ్చుకున్న అరుణమ్మ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలోనూ తనదైన రీతిలో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. గ్రౌండ్‌లోని ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తూ చిన్నారులు, మహిళలతో షటిల్ ఆడి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా ఆమె అందరిని పలకరిస్తూ..

-మిగతా2లో..



వాకర్స్‌తో మాట్లాడుతున్న డీకే అరుణ



# అండర్ పాస్‌తో అవస్థలు

- **ముందుకు సాగని మేళ్ల చెరువు అండర్ పాస్ నిర్మాణం**
- **అర్ధాంతరంగా నిలిచిన రైల్వే బ్రిడ్జి పనులు**
- **అవస్థలు పడుతున్న ప్రయాణికులు**



గద్వాల ప్రతినిధి, మార్చి 24, ప్రభాతవార్త : జోగులాంబ గద్వాల జిల్లా పట్టణం మేళ్లచెరువు రోడ్డు కర్నూల్ రైల్వే ట్రాక్, రాయిచూర్ రైల్వే ట్రాక్ అండర్ పాస్ రోడ్డు పనులు ప్రారంభమై దాదాపు రెండు సంవత్సరాలు అవుతుంది. ఇంకా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఆలస్యం అవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాయిచూర్ వెళ్లే రైల్వే ట్రాక్ అండర్ పాస్ రోడ్డు పనులు దాదాపు 5నెలలు అవుతుంది. పిల్లిగుండ్ల, మేళ్లచెరువు ప్రజలకు రాకపోకలకు చాలా ఇబ్బందులు ఏర్పడ్డాయి. రాయచూరు రైల్వే ట్రాక్ బ్రిడ్జ్ కింద టూ వీలర్స్ మీద పోయేవారికి చాలా కష్టపడి పోవాల్సి వస్తుంది. బ్రిడ్జి కింద వెళ్లాలంటే కొంతమందికి ప్రమాదం జరిగిన దాఖలాలు లేకపోలేదు. ఇక్కడ ప్రజలు రాకపోకలకు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. పిల్లిగుండ్ల కాలనీకి ఒక్క ఆటో కూడా రావడం , పోవడానికి అనుకూలం లేదు. వెంటనే గద్వాల నుంచి రాయచూర్ వెళ్లే రైల్వే అండర్ పాస్ రోడ్డు, గద్వాల నుంచి కర్నూల్ రైల్వే అండార్ పాస్ రోడ్ పూర్తి చేయగలరని మేళ్లచెరువు గ్రామ ప్రజలు, పిల్లిగుండ్ల కాలని ప్రజలు ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూన్నారు. రెండు రైల్వే ట్రాక్ మధ్యన పిల్లిగుండ్ల కాలనీ ఉన్నందున కాలనీ ప్రజలకు ఏదైనా అత్యవసర పనులు కలిగినచో గద్వాలకు రావాలంటే చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, కాబట్టి రైల్వే శాఖ అధికారులు వెంటనే స్పందించి ఇక్కడ జరగబోయే అండర్ పాస్ రోడ్లను పూర్తి చేయగలరని మేళ్లచెరువు గ్రామ ప్రజలు ,పిల్లిగుండ్ల కాలనీ ప్రజలు రైల్వే శాఖ అధికారులకు విన్నవిస్తున్నారు.

# గద్వాల టు గోవా

**ఎమ్మెల్సీ ఎన్నికలు తీరుస్తున్న సరదాలు**

**ప్రజా ప్రతినిధులుగా బోలెడంత డబ్బులు పెట్టి గెలిచారు.. ప్రగతి కోసం ఐదేళ్లు పరితపించారు.. సరైన నిధులు సమయానుకూలంగా అందక నిరసించారు. ఇప్పుడు వీళ్ళకి మంచి టైం వచ్చింది.. ప్రగతి కోసం కాదు.. సరదాల కోసం.. అందుకే చట్టాపట్టాలేసుకొని గోవాలో ఎంజాయ్ చేసున్నారు. సరిగమపదనిస..కరో కరో జల్సా అంటూ ఎంజాయ్ చేస్తున్నారు.**

**- గద్వాల ప్రతినిధి, మార్చి 24, ప్రభాతవార్త**

గద్వాల మున్సిపల్ పరిధిలోని కౌన్సిలర్లు నియోజకవర్గ పరిధిలోని ఎంపీటీసీలు ఇతర ప్రజాప్రతినిధుల కథ సరదాగా ఉన్న పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కసారి పరిస్థితి పరిశీలిస్తే.. గత డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ప్రజా ప్రతినిదులు పండుగ చేసుకున్నారు. ఇప్పుడు తాజాగా ఎమ్మెల్సి ఎన్నికలు ఒకవైపు,పార్లమెంటు ఎన్నికలు మరోవైపు ఉండడంతో ప్రజా ప్రతినిధులకు డిమాండ్ పెరిగింది. ఛాన్స్ దొరికితే పిల్లి ఎలుకను పట్టుకున్నట్టు వీళ్లను పటుకోని కండువాలు కప్పి పార్టీ మార్చేస్తున్నారు. ఈ భయంతోనే పార్టీ అధినేతలతో పాటు అభ్యర్థులు తమ వర్గంలో ఉన్న ప్రజా ప్రతినిధులను ఒడిసి పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తి అయ్యేదాకా యాత్రలు కొనసాగుతున్నాయి. ఇవన్నీ పుణ్యక్షేత్రాలు కాదండోయ్ గోవా లాంటి జల్సా ప్రాంతాలు ప్రస్తుతం గద్వాల్ అసెంబ్లీ పరిధిలో ఉన్న ప్రజా ప్రతినిధుల అందరిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గోవాకు తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడ ప్రస్తుతం ప్రజాప్రతినిధులంతా ఎంజాయ్ చేసే మూడ్‌లో ఉన్నారు. వాటికి సంబంధించిన చిత్రాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం అసెంబ్లీ పరిధిలో ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు ఇలా ఏ లెక్క తీసుకున్న బీఆర్ఎస్ కు అత్యధిక సంఖ్య ఉంది. గతంలో ఈ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన ఎన్నికలు కాబట్టి తమ ప్రాబల్యం పెంచుకునేందుకు ఎక్కువ శాతం మందిని గెలిపించుకున్నారు. అయితే ప్రస్తుతం ఈ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు, మరోవైపు పార్లమెంటు ఎన్నికల్లో తమ బలాన్ని చూపించేందుకు పక్కా పార్టీ మీద కన్నేసింది. అక్కడ అధికారంలో ఉన్న కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, కోసం గేట్లు తెరిసింది. ఈ నేపథ్యంలో కొంతమంది పార్టీలు కూడా మారారు. ఈ సంఖ్య మరింత పెరగకుండా ఉండేందుకు బీఆర్ఎస్ జాగ్రత్తపడుతోంది. ఇందులో భాగంగానే తమకు సంబంధించిన ప్రజాప్రతినిధులను టూర్లు తీసుకువెళ్లి అక్కడ ఎంజాయ్ చేయిస్తున్నారు. ఇదే ఛాన్స్‌గా భలే చాన్సులే లక్కీ ఛాన్సులే అంటూ ప్రజాప్రతినిధులు కూడా తమ పని ఒత్తిడిని మరిచిపోయి హాయిగా కాలక్షేపం చేస్తున్నారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ మధ్య జరుగుతున్న టామ్ అండ్



జెర్రీ ఆటలలో ప్రజాప్రతినిధుల పంట పండిందని రాజకీయ విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కూడా ఎంపిటిసిలు, కౌన్సిలర్లను క్యాంపు రాజకీయాలతో గోవాకు తీసుకెళ్లినట్లు తెలుస్తున్నది.

## బ్రహ్మోత్సవాల్లో అన్నదాన నిర్వహణ కార్యక్రమాన్ని నిర్వర్తించిన వారికి ఘన సన్మానం



**వెల్దండ, మార్చి24 ప్రభాతవార్త:**మండల పరిధిలోని గుండాల అంబరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జక్కుల చిన్న జంగయ్యయాదవ్, మండలి మహేష్ యాదవ్‌ల సహకారంతో నిర్వహించిన 12 రోజుల అన్నదాన కార్యక్రమంలో నిర్వహణ బాధ్యతలు చేపట్టిన సింహరెడ్డి దంపతులతో పాటు దేవేందర్,మల్లేష్‌తో పాటు ఆలయ అర్చకులు బాలస్వామిశర్మ, కృష్ణయ్యశర్మ, శివప్రసాద్‌శర్మ, సంతోష్‌శర్మ, నరహరిశర్మ, సురేష్‌శర్మలను జీయాగూడ యాదవ సంఘం అధ్యక్షులు జక్కుల చిన్న జంగయ్యయాదవ్ శాలు వాలతో సన్మానించి అభినందించారు. గత కొన్ని సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను చేపట్టి భక్తులందరికి కడుపు నిండా భోజనం అందించిన వారిని సన్మానించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, కొండలుయాదవ్, నరేష్, మహేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ప్రశాంత వాతావరణ హోలీ పండుగ జరుపుకోవాలి ఎస్సై తిరుపతిరెడ్డి

**రేవల్లి, మార్చి 24,ప్రభాతవార్త :** రేవల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాలలో అందరు హోలీ పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని,మీ జీవితాలు కూడా రంగులమయం కావాలని,శాంతిభద్రతలకు ఎలాంటి విగాతాలు కలగకుండా హోలీ పండుగ జరుపుకోవాలని ఆశిస్తున్నాను.ఎలక్షన్ కోడ్ కి ఇలాంటి విగాతం కలగకుండా సంతోషంగా హోలీ పండుగ చేసుకోవాలని తెలిపారు.ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలు ప్రమాదకరంగా నడపరాదు. అంతేకాకుండా హానికరమైన రంగులను మరియు మితిమీరిన పద్దతులను వాడి ప్రాణాల పైకి తెచ్చుకోకండి.చెరువులో కుంటల్లో కాలువలోకి స్థానాలకు వెళ్ళరాదు.అలాగే రేవల్లి మండల అన్ని గ్రామ ప్రజలకు మా రేవల్లి పోలీస్ తరపున నుండి అందరికి హోలీ శుభాకాంక్షలు.

## 38వ రోజు కొనసాగుతున్న దీక్ష..

**రేవల్లి, మార్చి 24,ప్రభాతవార్త :** రేవల్లి మండల పరిధిలోని బండరావిపాకుల గ్రామం శ్రీ ఏదుల వీరాంజనేయ ప్రాజెక్టులో బండరాయిపాకుల,కొంకలపల్లి 2015 లో ముంపునకు గురయింది. కొందరికి పునరావాసం డబ్బులు రాలేదు.ముగ్గురికి సంవత్సరాలు గడుస్తున్నా పరిహారం అందలేదు.38 రోజుల నుంచి దీక్ష చేస్తున్న అధికారుల నుండి ఎలాంటి సమాచారం లేదని అధికారుల తీరుకు నిరసనగా బాధితులు దీక్ష 38 రోజుకు చేరింది.స్పందించడం లేదని వ్యక్తం చేస్తున్నారు. దీక్ష చేస్తూ వారి నిరసనను తెలియజేశారు.మంది నెలల గడుస్తున్నా మాకు పునరావాసం డబ్బులు మరియు కొత్త గ్రామంలో ఇండ్ల స్థలాలు ఇవ్వడంలేదని పాత గ్రామంలో దొంగల బెడద ఉందని మాకు భద్రత కల్పించాలని వారు కోరారు.అధికారులు స్పందించే వరకు దీక్ష విరమించేది లేదని అవసరమైతే దేనికైనా ముందుకు పోతానని సుకుమార్ రెడ్డి అన్నారు.ఒక టోకెన్ నెంబర్ ఇచ్చారు.కానీ ఎలాంటి నష్టపరిహారం నగదును ఖాతాలో జమ్మ చేయలేదని అన్నారు.అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నాడు.

## ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు..!!



**భూత్పూర్, మార్చి 24,ప్రభాతవార్త :** దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) సమక్షంలో భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని అమిస్తాపూర్‌కు చెందిన అమిస్తాపూర్ యాదవ సంఘం అధ్యక్షుడు,బీఆర్ఎస్ పార్టీ నాయకుడు డోకూర్ శంకర్,యాదవ సంఘం నాయకులు దుబాయ్ కృష్ణయ్య,బత్తుల గోపాల్, గడ్డమీది యాదయ్య,బత్తుల శ్రీనివాస్‌లు ఆదివారం ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పవన్,సహదేవ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## సంతోష వాతావరణంలో హోలీ వేడుకలు జరుపుకోవాలి : ఎస్పై చంద్రకాంత్



**అలంపూర్ మార్చి 24 ప్రభాతవార్త :**జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని ప్రజలు, యువకులు హోలీ పండుగను పోలీసుల సూచనలు పాటిస్తూ సంతోష వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై చంద్రకాంత్ తెలిపారు. సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ. సోమవారం జరుపుకునే హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తించరాదని, ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సహకరించాలని కోరారు. మండల పరిధిలోని ప్రధాన చౌరస్తాలలో నిరంతరం పెట్రోలింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. యువకులు హోలీ ఆడేటప్పుడు కెమికల్స్‌కు రసాయన కలర్స్‌ను వాడరాదని, యువకులు అత్యుత్సాహం ప్రదర్శించరాదని, ద్విచక్ర వాహనాల పై రష్ డ్రైవింగ్ చేయరాదని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకొని వారి తల్లిదండ్రుల పై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హోలి రోజు పోలీస్ సిబ్బంది తో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందని, మద్యపానం సేవించి వాహనాలు నడపరదన్నారు.

## వివాహానికి కౌన్సిలర్ ఆర్థిక సహాయం..!!



**భూత్పూర్, మార్చి 24,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీ ఒకటవ వార్డు వసురాం తండాకు చెందిన స్వర్గీయ కాట్రావత్ లక్ష్మణ్ నాయక్ పెద్దకుమార్తె వివాహానికి తండావాసులతో పాటు స్థానిక కౌన్సిలర్ బాలకోటి పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందించారు. తండ్రిలేని కుమార్తె వివాహానికి ఇతోదికంగా తమ వంతు సహాయంగా కౌన్సిలర్ బాలకోటి రు.10వేలు,తండావాసులేకమై రు.45వేలు ప్రోగు చేసి ఆదివారం తండాలో పెళ్లిని ఘనంగా నిర్వహించారు.

## గాయపడిన అంగన్వాడి టీచర్‌కు ఆర్థిక సాయం



**వనపర్తి టౌన్, మార్చి 24,ప్రభాత వార్త :** పానగల్ మండలం అన్నారం సెక్టార్ షాగాపూర్ గ్రామ అంగన్వాడి టీచర్ అలివేల. 19/3/2024 మంగళవారం,నాడు పోషణ పక్వాడ్,ఫ్యామిలీ సర్వే హాజరవుతున్న సందర్భంలో.కొత్తపేట స్టేజి దగ్గర బైక్ పై నుంచి క్రిందపడి తలకు బలమైన గాయమై హైదరాబాద్ గచ్చి బౌలి ఏఐజి హాస్పిటల్లో చికిత్స పొందుతు ఉంది.అలివేల కుటుంబాన్ని వనపర్తి జిల్లా తెలంగాణ అంగన్వాడి టీచర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో. అలివేల వైద్య ఖర్చుల నిమిత్తం 1,34,700 వేల రూపాయలను అలివేల భర్త పరంధాములు,కూతురు పల్లవి లకు ఏఐజి హాస్పిటల్ లో సిఐటియు వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు,జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్.జిల్లా సహాయ కార్యదర్శిలు, ఆర్ఎన్ రమేష్ సూర్యవంశం రాము తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ మరియు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి నారాయణమ్మ జిల్లా ఉపాధ్యక్షులు కవిత.జిల్లా నాయకురాలు,శారద ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి.పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ,సిఐటియు కార్మిక సంఘం కార్మిక హక్కుల కోసం.కార్మిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని అన్నారు.గాయపడినటువంటి టీచర్‌కు ఆర్థిక సహకారం అందించిన వనపర్తి జిల్లా అంగన్వాడి టీచర్స్ మరియు హెల్పర్స్‌కు సిఐటియు వనపర్తి జిల్లా కమిటీ పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు.

## ఫతేపూర్ మైసమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే



**మక్తల్, మార్చి 24 ప్రభాతవార్త :** నవాబ్‌పేట మండలం ఫతేపూర్ మైసమ్మ అమ్మవారిని దర్శించుకొని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దర్శించుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు ప్రముఖ న్యాయవాది ఎన్‌పి వెంకటేష్ అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# అలంపూర్ ప్రజానీకం..

# ఓటర్ల తీర్పు ఏ పార్టీ వైపో?

**ఎమ్మెల్యే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన బీఆర్ఎస్ వైపా?**

**రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ వైపా?**

**లేకపోతే బిజెపి గత తాలూకు ఫలితాలు రిపీట్ చేస్తుందా?**

**త్రిముఖ పోటీలో నెగ్గేదెవరో?**

అలంపూర్ మార్చి 24 ప్రభాతవార్త: నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ సెగ్మెంట్‌లో ఈసారి జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీ జెండా ఎగురుతుందో? మరి ముఖ్యంగా ఎస్సీ సెగ్మెంట్ అయిన అలంపూర్ ప్రజలు ఏ పార్టీ అభ్యర్థిని ఆదరిస్తారో? అనే చర్చ సాగుతోంది. అయితే మూడు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి అయిన ప్రధాన పార్టీల్లో బలమైన అభ్యర్థులు బరిలో నిలిచారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అందులో ఐదు అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ పాగా వేసింది. మిగతా రెండు అసెంబ్లీ స్థానాల్లో బిఆర్ఎస్ పార్టీకి చెందిన అభ్యర్థులు గెలుపొందారు. అయితే మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి నేతృత్వంలో అలంపూరులో బిఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని చెప్పొచ్చు. అందుకు నిదర్శనం








అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిని 30వేల పై చిలుకు ఓట్లతో భారీ మెజార్టీతో గెలిపించారు. కానీ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అనూహ్యంగా ఓటకి పాలైంది. దీంతో అధికారం కోల్పోయింది. ఇక్కడి సమీప కాంగ్రెస్ ఎమ్మెల్యే పార్టీ అలంపూర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ పాగా వేసింది. మిశ్రమ ఫలితాలు రావడంతో అర్థం కాక ప్రజల్లో గందరగోళం నెలకొంది. అధికార పార్టీకి మొగ్గు చూపుతూ బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈసారి ఎంపీ ఎన్నికల్లో చల్లా నాయకత్వానికి ఎలాగైనా చెక్ పెట్టాలని ప్రజలు చర్చించుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా అధిష్టానం మల్లు రవి ని ఎంపీ అభ్యర్థిగా పేరును ఖరారు చేశారు. మల్లురవికి అలంపూరు నుండి భారీ మెజార్టీ ఇవ్వాలని కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఇటీవలే మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో ఆర్ఎస్పీ ప్రవీణ్ కుమార్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ప్రవీణ్ కుమార్ పేరును ఖరారు చేశారు. ఆయనది స్వస్థలం అలంపూర్ కావడంతో ఒకరకంగా క్యాడర్ కలిసొచ్చే అంశమనే చెప్పొచ్చు. బీఎస్పీ కార్యకర్తలు దీనికి తోడు ఎమ్మెల్యే చల్లా ఎమ్మెల్యే విజేయుడు నేతృత్వంలో బిఆర్ఎస్ పార్టీ క్యాడర్ బలంగా ఉందని భారీ మెజార్టీతో ఖాయమనే చర్చ జరుగుతోంది. ఇకపోతే బిజెపి నుంచి ఎంపీ పోతుగంటి రాములు కుమారుడు భరత్ ప్రసాద్ ఎంపీగా బరిలో నిలిచారు. గతంలో అలంపూర్ నియోజకవర్గంలో రావుల రవీంద్రనాథ్ హయాంలో మూడు పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన చరిత్ర బిజెపి పార్టీకి దక్కింది. దేనికి తోడు భరత్ తండ్రి ఎంపీ ఉంటూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో అలంపూర్ ప్రజలకు సేవలు అందించారు. పాత క్యాడర్ , కొత్త క్యాడర్ కలుపుకుని ముందుకు సాగుతున్నారనే చర్చ జరుగుతోంది. ఎలాగైనా అలంపూర్ నుంచి మంచి మెజార్టీని రాబట్టుకోవాలని ఆకాంక్షతో ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ముగ్గురు బలమైన నేతల్లో అలంపూరు ప్రజల తీర్పు ఎవరికి వరిస్తుందో ? మరి ఎంపీ ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే అంటున్నారు.

# పెంచిన పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలి : డీవైఎఫ్ఐ డిమాండు

**గద్వాల ప్రతినిధి మార్చి 23 ప్రభాతవార్త:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫీజును వెంటనే తగ్గించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పేరు నరసింహ డిమాండు చేశారు. పెంచిన టెట్ ఫీజును వెంటనే తగ్గించాలని డిమాండు చేస్తూ ఆదివారం ఉదయం స్థానిక జిల్లా కేంద్రంలోని గ్రంధాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఫీజులు లేకుండా పోటీ పరీక్షలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొని ఇప్పుడు ఇంత పెద్ద మొత్తంలో ఫీజులు పెంచితే నిరుద్యోగులు ఎక్కడి నుంచి తెచ్చి కడతారని ప్రశ్నించారు. గతంలో టెట్ ఎన్ని పేపర్లు రాసిన 300 ఫీజు మాత్రమే ఉండేదని ఇప్పుడు ఏకంగా ఒక్కోక్క పేపర్‌కు 1000 రూపాయలు చొప్పున రెండు పేపర్లకు 2000 రూపాయలకు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ వైఫల్యం వల్ల అనేక మంది విద్యార్థులు, నిరుద్యోగులు తమ విలువైనటువంటి సమయాన్ని గ్రంథాలయాలకే వెచ్చించి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారని అన్నారు. కొన్ని సంవత్సరాలుగా నిరుద్యోగులు తమకు ఉన్న కొద్దిపాటి ఇల్లు, పొలాలు, స్థలాలు, ఆస్తులు తాకట్టుపెట్టి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యారని, ప్రభుత్వం సకాలంలో పోటీ పరీక్షలు నిర్వహించకపోవడం వల్ల తమ విలువైన జీవితాన్ని ఆదాయాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి




టెట్ ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేస్తున్న దృశ్యం

పరిస్థితుల్లో ప్రభుత్వం గతంలో ఫీజులు తగ్గించాల్సింది పోయి ఏకంగా భారీ మొత్తంలో పెంచడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఒకవైపు ఉపాధి లేక గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వలసలు వెళుతున్నారని కరువుతో పేద ప్రజానీకం అల్లాడుతున్నారని ఇటువంటి దుర్బర పరిస్థితుల్లో ప్రభుత్వమే ఫీజులు భరించవలసింది. పోయి నిరుద్యోగ అభ్యర్థులను దోచుకోవడం సరైంది కాదన్నారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో గ్రంధాలయ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి అన్ని కనీస మౌలిక వసతులతో నిరుద్యోగులకు అందించాలని, అంతవరకు ఉన్న గ్రంథాలయంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండు చేశారు. ఉపాధ్యాయ అర్హత పరీక్షను కూడా నిర్ణయించిన సమయానికే నిర్వహించాలని గత ప్రభుత్వంలో లాగా వాయిదాలు వేసే ధోరణిని కొనసాగించవద్దని కోరారు. పెంచిన ఫీజులు తగ్గించకపోతే నిరుద్యోగులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వివి నరసింహ ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపి మాట్లాడుతూ ప్రభుత్వానికి వేరే ఆదాయం లేనట్లు నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో అర్థం ఏమిటని ప్రశ్నించారు. అసలే నిరుద్యోగ సమస్యతో రాష్ట్రం అల్లాడిపోతుంటే ప్రభుత్వం నిరుద్యోగ భృతిని ఇచ్చేది పోయి నిరుద్యోగుల నుంచి ఆదాయాన్ని సమకూర్చు కోనే దౌర్భాగ్య పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. నిరుద్యోగుల పక్షపాతిగా చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజులు తగ్గించాల్సింది పోయి పరీక్షల ఫీజులను కూడా ప్రభుత్వమే భరించే విధంగా చొరవ చూపాలని కోరారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై స్పందించి టెట్ ఫీజులు తగ్గించాలని అంతవరకూ నిరుద్యోగులు చేసే కార్యక్రమాలకు కార్మిక సంఘం కూడా తమ మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, చందు, నరేష్, నరసింహులు, రంగస్వామి,ఉప్పేరు నర్సింహులు శ్రీను నాయక్ పాల్గొన్నారు.

## వసంతోత్సవాల హోలీకి మోదుగ పూవ్వుతో రంగుల కేళి..



**వీపనగండ్ల, మార్చి 24,ప్రభాతవార్త :** వసంత ఋతువుల్లో వచ్చే హోలీ పండుగ యువతి యువకుల ను ఎంతో ఆకర్షించే విధంగా ఈ హోలీ పండుగ జరుపుకోవడం జరుగుతుంది అయితే ఈ హోలీ పండుగలో అనేక రకాలుగా ప్రత్యేకతలు ఉన్నాయి రంగులు చల్లుకొని హోలీ పండుగ జరుపుకునే యువతి యువకులు గతంలో ఉండేది అయితే ప్రస్తుతం ప్రకృతి నుంచి వచ్చే పువ్వులు రంగులు కాకుండా ప్రస్తుతం ఆయిల్ తో కూడిన రంగులను కోడిగుడ్లను చల్లుకొని హోలీ పండుగ నిర్వహిం చుకోవడం ఆనవాయితీగా ఏర్పడింది అయితే అందులో ప్రత్యేకత ఇంకొకటి ఉన్నది ప్రకృతి పరంగా వస్తున్న మోదుగ పువ్వు ఎర్రని పుష్పం ద్వారా కలరు ఏర్పాటు చేసుకొని వాటిని ఒంటి పై చల్లుకొని హోలీ ఆడడం ఎంతో ఆనందదాయకంగా ఉంటుంది అయితే వసంత రుతువులో ఉగాది సందర్భం గా ప్రకృతిలో ఆకులు రాలి పూతలు ఏర్పడి అడివికే అందాన్ని మోదుగ పువ్వు ఏర్పడి అడవి మొత్తం ఎర్రబారిందా అన్న ఆహ్లాదాన్ని మోదుగ పువ్వు ఇస్తుంది దాని ద్వారా అడవి మొత్తం ఎర్రబారి సూపర్ లకు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుంది అంతేకాక ఈ పువ్వు తెంచుకొచ్చి నీటిలో నానబెట్టి కలరు తయారు చేసుకుని హోలీ పండుగ ను ఆడటం ఆనవాయితీగా ఉన్నది ప్రస్తుతం యువకులు వివిధ రకాల ఆయిల్ కలర్లను వాడడం ద్వారా ఆరోగ్యాలకు హాని కలిగే ఉంది అని డాక్టర్లు సైంటిస్టులు చెబుతున్నప్పటికీ వాటిని వాడవద్దు అని అంటున్న ప్రస్తుత లేటెస్ట్ లో యువతీ యువకులు వాటినే వాడుతున్నారు. వాటి ద్వారా కంటి చూపులు కోల్పోవడమే కాక మిగతా అనారోగ్యాలకు పాలయ్యి ఇబ్బందులు పడతారని డాక్టర్లు చెబుతున్నారు దానికి బదులు ప్రకృతిలో లభించే పుష్పాలను ద్వారా వచ్చే కళలను ఉపయోగిం చుకొని హోలీ పండుగ జరుపుకోవాలని సూచిస్తున్నారు.అందులో భాగంగానే మోదుగ పువ్వు ఒకటి అని వారు వివరిస్తున్నారు.

## అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ..

**చిన్నంబావి, మార్చి 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని దగడపల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బొజ్జన్న ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆదివారం దగడపల్లి గ్రామంలో భూమిపూజ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడని సమ సమాజ స్థాపన ధ్యేయంగా అంబేద్కర్ కృషి చేశారని ఆయన అన్నారు. గ్రామ సర్పంచ్ పోతుగంటి సువర్ణ, ఉపసర్పంచ్ కొమ్మగంగాధర్, అంబేద్కర్ యువజన సంఘం కమిటి సభ్యులు అంబేద్కర్ విగ్రహం ప్రతిష్టాపనకు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ సువర్ణ, ఉపసర్పంచ్ గంగాధర్ మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో మార్పుసాధ్యమని బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆయన దిశా నిర్దేశం చేస్తూ రాజకీయ అధికారంతోనే సామాజిక, ఆర్థిక సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. అంటరానితనం, వెంటాడిన విద్య అనే ఆయుధంతో చదువుకొని ప్రపంచమే గర్వించేలా భారతదేశానికి లౌకిక ప్రజాస్వామ్య భారత రాజ్యాంగాన్ని రూపొందించి మార్గ నిర్దేశం చేసిన గొప్ప మహనీయుడు అంబేద్కర్ అన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు కురుమయ్య, శంకర్, దర్గా వెంకటస్వామి, బాలపీరు, శ్రీమంతుడు, స్వామినాథ్, బాలచంద్రుడు, కాసిం,స్వామి, కురుమయ్య, శివ, శ్రీను, శ్యాంసుందర్, విష్ణు, విధాత, గంగారాముడు, రామచందర్, అధిక సంఖ్యలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.



విగ్రహ నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

## ప్రశాంత వాతావరణంలో హోలీ జరుపుకోవాలి..

### మక్తల్ సిఐ చంద్రశేఖర్




**మక్తల్, మార్చి 24 ప్రభాతవార్త :** హోలీ పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీస్ వారి సూచనలను తప్పకుండా పాటించాలని మక్తల్ ప్రజలకు సిఐ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. హోలీ పండగ అందరు సంతోషంగా జరుపుకోవాలని ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించరాదని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మక్తల్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో పోలీస్ డిఫెన్స్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, యువకులు హోలీ ఆడేటప్పుడు రసాయన పదార్థాల సంబంధిత రంగులు ఉపయోగించరాదని రసాయనాల వల్ల చర్మవ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ద్విచక్ర వాహనాలు రోడ్లపైన జాగ్రత్తగా నడిపించాలని వాహనదారులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వరాదని మైనర్ డ్రైవర్ చేస్తే వారిని పట్టుకుని తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. పోలీస్ సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో నిర్వహించడం జరుగుతుందని మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. మద్యపానం సేవించి దొరికిన వాహనాలపై కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని తెలియజేశారు.

## మల్లురవిని సన్మానించిన మాజీ ఎంపీపీ



**వెల్దండ, మార్చి 24 ప్రభాతవార్త:**కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ మల్లురవిని ప్రకటించడంతో మాజీ ఎంపీపీ జయప్రకాష్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మల్లురవి నివాసంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని జయప్రకాష్ అన్నారు. కార్యక్రమంలో నాగేష్ పలువురు నాయకులు ఉన్నారు.

## ఆసుపత్రికి ఆక్సిజన్ మిషన్ కిట్ అందజేత..



**దేవరకద్ర, మార్చి 24 ప్రభాతవార్త :** దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ గ్రామంలో అత్యవసర సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటానికి గంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఖమరుద్దిన్‌కు చెందిన ప్రైవేట్ ఆసుపత్రికి గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు చందుగౌడ్ ఆక్సిజన్ మిషన్ కిట్‌ను అందజేశారు. ఆసుపత్రికి వచ్చే వారికి అత్యవసర సమయంలో ఆక్సిజన్ అందించడానికి ఈ మిషన్ కిట్టును అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కోమటి రాములు, నరసింహాచారి, గొల్లమోని ఉదండారావు, గోవు కతలయ్య, చిన్న కర్రెన్న, ఫయాజుద్దిన్, చిన్న కర్రెన్న తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## షటిల్ ఆడి.. వ్యాయామం చేసి

మొదటి పేజీ తరువాయి..



వాకర్స్‌తో మాట్లాడుతున్న డికె అరుణ

మనం ఇప్పుడు వేసే ఓటు మోడీకోసం దేశంకోసం అని పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాల్లో కొనియాడుతున్న మోడీని మరోసారి ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. 370 ఆర్టికల్, 500ఏండ్ల రామమందిర నిర్మాణం కేవలం మోడీ వల్లే సాధ్యమైందన్నారు. నేడు 400 సీట్లకు పైగా ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ కేంద్రంలో మోడీ ప్రభుత్వమే వస్తుందన్నారు. ప్రతి ఒక్కరు తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని కోరారు. ఆమె వెంట బిజెపి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీ నివాస్‌రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు కిరణ్‌కుమా ర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో బిఎస్పీ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



**ఇటిక్యాల,మార్చి 24 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఎస్పీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పని చే యాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇంఛార్జి ఎంజి కృష్ణ, ఉపా ధ్యక్షులు జి. మణికుమార్ అన్నా రు. ఆదివారం మండల పరిధిలో ని ఎర్రవల్లి చౌరస్తాలోని పార్టీ ఆఫీసులో ముఖ్య కార్యకర్తల సమావేశం ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా ఇంఛార్జి ఎంజి కృష్ణ మాట్లాడుతూ జిల్లా,మండల స్థాయినుండి వార్డు స్థాయి వరకు పూర్తి కమిటీలు వేసు కోవాలని క్షేత్రస్థాయిలో మహనీయుల సిద్ధాంతాలను తెలియజేస్తూ ప్రజలను చైతన్యవంతం చేయా లన్నారు. ప్రజలను ఓటు ద్వారా చైతన్యవంతం చేసి సీట్లను గెలిపించుకోవాలన్నారు. పార్టీ నియ మించిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఆకెపోగు రాంబాబు, గద్వాల నియోజకవర్గ ఉపాధ్యక్షులు సవారన్న, నర్సింహులు, నాగరాజు, ఆకెపోగు వినోద్‌కుమార్, భాస్కర్, సికందర్, ఆకెపోగు బీసన్న, బొజ్జన్న పాల్గొన్నారు.

## ఆగమన శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధికి అన్ని రంగాల్లో కృషి..

**అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ**

**ఉప్పునుంతల,మార్చి24 ప్రభాతవార్త :** మండలంలోని మామిళ్లపల్లి లక్ష్మినరసింహస్వామి ఆగమన శాస్త్ర ప్రకారంగా ఆలయ అభివృద్ధికి అన్ని రంగాల్లో కృషి చేస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మామిళ్లపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మి నరసింహస్వామి కళ్యాణో త్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని వచ్చే సంవత్సరంలో జరిగే బ్రహ్మోత్సవాలకు ఆలయ అభి వృద్ధి కోసం 20లక్షల వరకు నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన మధుసూదన్‌రావు ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇవ్వడంతో శాలువాలతో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణతో పాటు ఆయన సతీమణి అమ్రాబా ద్ జడ్పీటిసి సిబిఎం ట్రస్టు ఛైర్‌పర్సన్ డా. చిక్కుడు అనురాధ, ఆలయ కమిటి ఛైర్మన్ మాధవరం రాజల్‌రావు, ఈట శ్రీనివాసరావు, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటి ఛైర్మన్ కందూర్ సుధాకర్, శ్రీ లక్ష్మినరసింహస్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 12 అంబేద్కర్ జయంతి సభను జయప్రదం చేయాలి..

**దళిత సంఘాలు పిలుపు**



**గద్వాల ప్రతినిధి మార్చి 23 ప్రభాతవార్త:** ఏప్రిల్ 12 ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ ఆలోచన పండగ సభ, ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సి, ఎస్టీ ఉపాధ్యాయులు ఆదివారం పిలుపునిచ్చారు. డా.బిఆర్.అంబేద్కర్ ఆలోచన పండగ సభ పాంప్లెట్లను టీఎన్జీవో భవన్లో సమావేశమై రిలీజ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకునేందుకు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి అంబేద్కర్ ఆలోచన పండుగను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, రమేశ్, హనుమంతు, కరుణాకర్, వాల్మీకి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పూదురు ఆశన్న, ఆల్ ఇండియా అంబేద్కర్ యువ సంఘం జిల్లా అధ్యక్షులు మాచర్ల ప్రకాశ్, పులికల్ అశోక్, బల్గేర మోజేష్, మల్లెచెరువు యేసురాజు, దాసన్న, మోహన్‌రాజు, రాజబాబు, లక్ష్మణ్ నర్సింహులు, రత్నం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## హోలి పండుగలో పోలీస్ నిబంధనలు పాటించాలి ..

**అయిజ ఎస్సై విజయ్ భాస్కర్**



**అయిజ మార్చి 24 ప్రభాతవార్త:** మండలంలోని ప్రజలు యువకులు హోలి పండుగను పోలీసుల సూచనలు పాటిస్తూ జరుపుకోవాలని ఎస్సై విజయ్ భాస్కర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు నేడు జరుపుకునే హోలి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తించరాదని, ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల పరిధిలోని ప్రధాన చౌరస్తాలలో నిరంతరం పెట్రోలింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. యువకులు హోలి ఆడేటప్పుడు కెమికల్స్ కు రసాయన కలర్స్ ను వాడరాదని, యువకులు అత్యుత్సాహం ప్రదర్శించరాదని, పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకొని వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హోలి రోజు పోలిసు సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందని మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని అన్నారు.

## ఏప్రిల్‌లో బిసి మహిళా గర్జన సభ..

**ఓబిసి డెవలప్‌మెంట్ ఫోరమ్ ఛైర్మన్ కోట్ల కిశోర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 24 ప్రభాతవార్త :** బిసి మహిళల ఐక్యత సంక్షేమం, అభివృద్ధి, నినాదంతో పాలమూరు జిల్లా కేంద్రంలో 25 వేల మంది బిసి మహిళలతో ర్యాలీ, ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని ఓబిసి డెవల ప్‌మెంట్ ఫోరమ్ ఛైర్మన్ కోట్ల కిశోర్ అన్నారు. మహ బూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ని టీఎన్జీఓ భవన్‌లో ఆదివా రం ఏర్పాటు చేసిన విలేఖరు ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసి మహిళా సాధికారత, బిసి మహిళా సంక్షేమాభివృద్ధి, ఒకరికి ఒకరం, మనమంతా బిసిల అభివృద్ధి కోసం నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే సందర్భంలో బిసి మహిళల సమగ్రతాభివృద్ధి కోసం భవిష్యత్ వర్తమానాలలో చేపట్టాల్సిన కార్యక్రమాల రూపకల్పన, తదితర అంశాలపై ఈ బిసి మహిళా గర్జన సభలో నిర్ణయాలను సమిష్టిగా, అందరి అభిప్రాయాల కూర్పుతో ఏకాభిప్రాయంతో నిర్ణయాలను తీసుకుని భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సమావేశంలో ఓబిసి డెవలప్‌మెంట్ ఫోరమ్ యువత అధ్యక్షులు టంకరి శివప్రసాద్ యాదవ్, నాయకులు చింతసాయికుమార్, బోయ విజయ్‌కుమార్, అంజి, వెంకటేష్ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కోట్ల కిశోర్

# క్యాంపులకు తరలిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు...

**27న క్యాంపుల నుండి రాక.. 28న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్**

**ఇటిక్యాల,మార్చి 24 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ఈనెల 28న నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీలకు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చేజారకుండా ఉండేందుకు గాను ఇటు కాంగ్రెస్ పార్టీ అటు బిఆర్ఎస్ పార్టీలకు చెందిన స్థానిక సంస్థల ప్రతినిధులను మూడు నాలుగు రోజుల కిందటే ఇతర ప్రాంతాలకు క్యాంపులకు తరలించారు. 2019 ఎన్నికల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా అప్పటి అధికార పార్టీ టిఆర్ఎస్ ప్రభుత్వం పాలన ఉండడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం బిఆర్ఎస్ పార్టీ తరపున 90 శాతం మేర బిఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన వారే ఉన్నారు. వీరందరిని కాపాడుకునేందుకు టిఆర్ఎస్ పార్టీ చెందిన మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి రంగంలోకి దిగి 28న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపుకోసం వారు ప్రత్యేక చొరవ తీసుకొని పలు ప్రాంతాలకు క్యాంపులకు తరలించారు.ఇటు అధికార కాంగ్రెస్ పార్టీ సైతం మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన ఆయా నియోజకవర్గం ఎమ్మెల్యేలు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సైతం కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి గెలుపుకోసం తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టారు.



క్యాంపులకు తరలివెళ్లిన అలంపూర్ కాంగ్రెస్ ఎంపిటిసిలు, కౌన్సిలర్లు

టిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులతో ఇప్పటికే మంతనాలు జరుపుతూ చాలామంది ప్రజాప్రతినిధులను బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి కూడా చేర్చుకుంటున్నారు. పలు ప్రాంతాల క్యాంపులకు తరలించిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల వెంట అటు కాంగ్రెస్‌పార్టీ మండలాల ముఖ్యనేతలు, ఇటు బిఆర్ఎస్ పార్టీకి చెందిన జడ్పీటిసిలు పార్టీ ముఖ్యనేతలు వారి వెంటే క్యాంపులలో ఉన్నారు. 28న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా 27వతేదీన క్యాంపుల నుండి గ్రామాలకు చేరుకునే ఏర్పాట్లు ఇప్పటికే ఆయా పార్టీ నాయకులు చేపట్టారు. నడిగడ్డలో గద్వాల అలంపూర్ నియోజకవర్గాల నుండి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోమహన్‌రెడ్డి,ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, స్థానిక సంస్థల ఎన్నికలలో మెజార్టీ ఓట్లు రాబట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అటు సంపత్‌కుమార్, జడ్పీ ఛైర్మన్ సరిత తిరుపతయ్యలు కూడా కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి గెలుపు కోసం మెజార్టీ ఓట్లు రాబట్టేందుకు రంగంలోకి దిగి మంతనాలు జరుపుతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 225 స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల ఓట్లు ఉండగా జిల్లాల మొత్తం 1439 ఓట్లు ఉండడంతో అభ్యర్థి గెలుపు కోసం కనీసం 721 ఓట్లు కావలసి ఉంటుంది.

## నన్ను ఆశీర్వదించండి..

(మొదటి పేజీ తరువాయి..)

పాలకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని పలువురు వాపోయారు. తప్పకుండా యోగా షెడ్ నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. తనకు ఎన్నికల్లో సహకరించాలని యోగా సాధకులను కోరా రు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత 100 రోజుల పాటు జరిగిన ప్రజాపాలన ప్రజారంజకంగా ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలు స్వేచ్ఛగా సంతోషంగా ఆనం దంగా ఉన్నారని రానున్న రోజుల్లో ఇంకా మహబూబ్‌నగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకునేలా మీ అందరి సహకారం, ఆశీస్సు లు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అభివృద్ధి అన్నది ఎక్కడా ఆగకుండా పార్లమెంట్ నియోజకవర్గంలోని శాసనసభ్యుల సహకారం తో అన్ని వర్గాల కులాల, మతాల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. గతంలో నేను ఎమ్మెల్యేగా పని చేసినా నాపై ఎలాంటి అవి నీతి ఆరోపణలు రాలేదని, నేను నా జీవితంలో మచ్చలేని రాజకీయ నాయ కుడిగా ఎదుగుతున్నానని ఆయన స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి నన్ను గెలిపిస్తే, దళిత, గిరిజన, బడుగు, బలహీన,మైనార్టీ వర్గాలకు సముచిత స్థానం, గౌరవం పెంపొందించే విధం గా, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు తగ్గట్టుగా సమగ్ర అభివృద్ధి అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఎంవిఎస్ కళాశాల గ్రౌండ్ నుండి బైక్‌పై న్యూటౌన్‌లోని సవేరా టీ పాయింట్ వరకు వచ్చి అక్కడ టీ తాగుతూ మహబూబ్‌నగర్ సమస్యలపై, వివిధ అంశాలపై ప్రజలతో ముచ్చటించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎన్‌పి వెంకటేష్, సత్తూరు చంద్రకుమా ర్, మహబూబ్‌నగర్ జిల్లా మైనార్టీ సెల్ ఛైర్మన్ ఫయాజ్, సిరాజ్‌ఖాద్రి, బి. మధుసూదన్‌రెడ్డి, గంజి ఆంజనేయులు, సిజె బెనహర్, అజ్మత్ అలీ, జె. చంద్రశేఖర్, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



యోగ సాధకులతో చల్లా వంశీచంద్‌రెడ్డి



వాకర్స్‌తో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

## ప్రధాని మోదీ పాలనకు ఆకర్షితులై భాజపాలో చేరికలు..

**బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ**

**బాలానగర్, మార్చి 24 ప్రభాతవార్త :** దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో అమోఘమైన అభివృద్ధి జరుగుతుందని, అభివృద్ధిని చూసి ఆకర్షితులై బిజెపిలో చేరుతున్నారని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు డికె అరుణ సమక్షంలో బాలానగర్ బిజెపిలోకి భారీగా చేరికలు జరిగాయి. పార్లమెంట్ ఎన్నికల వేళ మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో రాజకీయం రంజుగా సాగుతోంది. బిజెపి అభ్యర్థి డికె అరుణమ్మ ఆధ్వర్యంలో పార్టీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండల బిఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 30 మంది నాయకులు, కార్యకర్తలు అరుణమ్మ ఆధ్వర్యంలో బిజెపిలో చేరారు. వీరందరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రతి కార్యకర్త కష్టపడి బిజెపి పార్టీ గెలుపు కోసం కృషిచేసి, పాలమూరు ప్రగతికి పాటుపడాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.



డికె అరుణ ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో చేరిన దృశ్యం

**బిజెపిలో చేరిన వారిలో...** యాదవ సంఘం మండల అధ్యక్షులు, మాజీ సర్పంచ్ సాటి శ్రీనివాస్ యాదవ్, మాజీ గ్రంథాలయ కమిటి ఛైర్మన్, మాజీ వార్డు సభ్యులు గాండ్ల ప్రభాకర్, సూరారం మాజీ సర్పంచ్ పూడూరు లింగం, రంగాపురం రఘునాథ్‌రెడ్డి, ఉల్కుందకార్ మహేశ్వర్‌జీ, నల్లవోతుల శ్రీకాంత్, సాటి నరేష్, భాగం రవి, భాగం శివ, బత్తుల శ్రీకాంత్‌గౌడ్, భాగం శ్రీకాంత్,బంగూరి శ్రీశైలం, లక్ష్మి, సూరారం గ్రామస్తుడు సతీష్, పెద్దబాయ తండాకు చెందిన రవిందర్ నాయక్ ఉన్నారు.

## కెఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో అంబలి కేంద్రం ప్రారంభం..

**చిన్నంబావి,మార్చి24 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో కొత్త మాధవరావు ట్రస్టు ఛైర్మన్ కొత్త కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో మండల ప్రజలకు అంబలి, చలివేంద్రం ఏర్పాటు చేసి కొత్త కళ్యాణ్ కుమారుడు కొత్త అను సుజాత్, కూతురు కొత్త అని హితల చేతుల మీదుగా అంబలి, చలివేంద్రం ప్రారంభించా రు. అనంతరం కళ్యాణకుమార్ పుట్టినరోజు వేడుకలను ఘ నంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లు చంద్రశేఖర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొ ని మాట్లాడుతూ నిరుపేదలకు అండగా నిలిచే కొత్త కళ్యాణ్ కుమార్ మండల ప్రజలకు ప్రజాసేవలో కొనసాగుతూ నిరుపే ద విద్యార్థులకు, ఆర్థికంగా వెనకబడ్డ కుటుంబాలకు చేదోడు గా నిలుస్తూ కెఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో పలు సేవా కార్య క్రమాలు కొనసాగిస్తున్నారని గత రెండేళ్లుగా ప్రజలు అంబలి కేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేస్తున్నారని, వెల్టూరు గ్రామంలో కెఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత ఫిల్టర్‌వాటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పలు దేవాలయాలకు దాతగా ఉంటూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని మున్ముందు మరెన్నో సేవా కార్యక్రమాలతో ప్రజలకు సేవ చేసుకునే భాగ్యాన్ని కలిగి ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం కొత్త కళ్యాణకుమార్ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పండ్లు పంపిణీ చేసి, మిఠాయిలు పంచి అంబలి, తాగునీటి చలివేంద్రం ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో కెఎంఆర్ ట్రస్టు సభ్యులు, మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## హక్కులకై కదం తొక్కిన బీడీ కార్మికులు..

**బీడీ యజమాన్యాలకు డిమాండ్ నోటీస్.. 1000 బీడీలకు రూ. 376 కూలీ ఇవ్వాలి**

**చిన్నచింతకుంట,మార్చి 24 ప్రభాతవార్త :** హక్కుల సాధనకై బీడీ కార్మికులు కదం తొక్కారు. ఆదివారం తెలంగాణ బీడీ కార్మిక సం ఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సంత బజార్ ఆవరణలో బీడీ కార్మికుల సభ నిర్వహించారు. ఈ సభకు సంఘం జిల్లా అధ్య క్షులు పి. యాదగిరి అధ్యక్షత వహించారు. ఈ సభకు ముఖ్య అతి థులుగా విచ్చేసిన రాష్ట్ర నాయకులు టిఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎన్. సిద్ధిరాములు, కెఎంపిఎస్ జాతీయ కన్వీనర్ బందారు లక్ష్మయ్యతో పాటు టిఎఫ్‌టియు నాయకులు జలాల్‌పాషాలు మాట్లాడుతూ కార్మి క చట్టం ప్రకారం కనీస వేతనం 1000 బీడీలకు రూ. 376 ఇవ్వా లని డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం పని మానినా బీడీ కార్మికులు చనిపోతే వారి కుటుంబాలకు గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్‌లో యజమాని వాట చెల్లించడం లేదని వెంటనే బీడీ యాజమాన్యాలు పీఎఫ్‌లో తమవాటా జమ చేయాలన్నారు. పిఎఫ్‌లో తప్పులు సరిచేసే బాధ్యత బీడీ యజమాన్యాలు చూసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల సాధనకై టిఎఫ్‌టియు నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. బీడీ కార్మికుల పోరాటానికి తెలంగాణ స్కూల్ స్వీపర్ల సంఘం మద్దతు తెలుపుతున్నట్లు అధ్యక్షులు జి. ఘటన తెలిపారు. సభ ప్రారంభంలో భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళుల ర్పించారు. అంతకు ముందు సంత బజార్ నుండి బీడీ కార్మికులు ర్యాలీగా బయలుదేరి బీడీ యాజమాన్యాలకు డిమాండ్ నోటీసును అందజేశారు. కార్యక్రమంలో శంకర్, దావీద్, లక్ష్మి, నాగరాజు, కురుమన్న, మహేందర్, జింకల రాజు, నాగులు, ఆనందం, లక్ష్మన్న, జానకి, హోటల్ శ్రీను పాల్గొన్నారు.




మాట్లాడుతున్న టిఎఫ్‌టియు నాయకులు



మాట్లాడుతున్న టిఎఫ్‌టియు నాయకులు

## భక్తి శ్రద్ధలతో ఉత్సవ మూర్తులకు నవ కలశ స్థాపన.



**బిజినేపల్లి,మార్చి 24 ప్రభాతవార్త :** వట్టెం బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు స్థానార్చకులు శ్రీ మధ్వాదుల సముద్రాల శ్రీమన్నారాయణచార్యులు, ప్రధానార్చకులు శ్రీ ప్రసాదచార్యులు ఆధ్వర్యంలో ప్రాతరారాధన, చతుస్థానార్చన, హోమం, సేవాకాలం, బాలభోగ నివేదిన, పూర్ణాహుతి, బలిప్రదానం, శాత్తుమొబై, తీర్థ ప్రసాద గోష్ఠి, ఉత్సవులు నవకలశ స్థాపన తిరుమంజనసనం, అలంకారము, రాజబోగ నివేదన, శాత్తుమొత్తై తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయమారాధన, చతుస్థానార్చన, మూర్తిమస్త హోమం, ఎదుర్కోలు ఉత్సవం, నివేద, పూర్ణాహుతి, శాత్తుమొబై, తీర్థ ప్రసాదగోష్ఠి కార్యక్రమాలను అర్చక బృందం నిర్వహించారు. ఎదుర్కోలు ఉత్సవంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు. ఛైర్మన్ అనంత నరసింహారెడ్డి, వ్యవస్థాపక సభ్యులు సందడి ప్రతాప్‌రెడ్డి, కొర్త చంద్రారెడ్డి, గుబ్బ సత్యనారాయణ, బండారు రాజశేఖర్, వడ్ల భాస్కరాచారి, చింతకింది శ్రీనివా సులు, నరసింహాచార్యులు, తివారి, విజయ్, రామకృష్ణ, రామ్‌తేజ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవులకు నవకలశ స్థాపన నిర్వహిస్తున్న అర్చక బృందం

## చేపల వేటకు వెళ్లి శవమై తేలిక వ్యక్తి..

**బిజినేపల్లి,మార్చి 24 ప్రభాతవార్త :** గంగారం గ్రామ చెరువులో మూడు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లి ఆదివారం శవమై తేలి న సంఘటన చోటు చేసుకుంది. కర్ణాటక బళ్లారి ప్రాంతానికి చెందిన చలపతి (40) గంగారం గ్రామానికి ఐదు నెలల క్రితం వచ్చి నార్లపురం ఆంజనేయులు వద్ద కూలీకి కుదిరాడు. రాయి కొట్టే పనికి వెళ్లే చలపతి అప్పుడప్పుడు గ్రామంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లేవాడని ఆంజనేయులు తెలిపాడు. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలోపడి మృతి చెందినట్లు పోలీ సులకిచ్చిన ఫిర్యాదులో ఆంజనేయులు పేర్కొన్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.



## సీఎంకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన మోహన్‌నాయక్



**బాలానగర్,మార్చి 24 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని హోలీ పండుగ శుభాకాక్షలు తెలపడం జరిగిందని జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మోహన్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలపడం జరిగిందన్నారు. అలాగే జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి హోలీ శుభాకాంక్షలు తెలపడం జరిగిందన్నారు. అలాగే తన స్వగ్రామం అయిన తిరుమలగిరి నుంచి కిచ్యానాయక్ తండా, దేగావత్ తండాలకు వెళ్లే రోడ్డుపై వంతెన నిర్మాణం, సబ్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణం, తమ గ్రామ సమస్యల గురించి విన్నవించారు. వీటికి సీఎం సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యేతో మాట్లాడి త్వరలోనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

## ఘనంగా హజ్రత్ సదయ్యత్ హక్కాని షా సాహెబ్ ఉర్సూ ఉత్సవాలు..

**- కన్నుల పండువగా గంధోత్సవం**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 24 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో శనివారం రాత్రి ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గంధం ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. సయ్యద్ హక్కాని షా సాహెబ్ దర్గాలో భక్తి శ్రద్దల మధ్య ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకుల నివాసాల్లో ఖవ్వాలి కార్యక్రమాలతో ఫాతిహా అనంతరం దర్గాలో గంధం సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. సయ్యద్ ఇమ్రాన్ చిస్తీ నివాసంలో ఖవ్వాలి, గంధం ఉత్సవం నిర్వహించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా నలుమూలలలో పాటు వివిధ రాష్ట్రాల్లో ఉన్న హజ్రత్ సయ్యద్ హక్కాని షా సాహెబ్ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమంతో ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వాహకులు నిర్వహించారు. ఆదివారం కూడా భక్తులకు అన్నదాన, దీపాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు.

## మల్లురవి సమక్షంలో కాంగ్రెస్ చేరిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్ మాదిగ



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 24 ప్రభాతవార్త:**టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవి నివాసంలో ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్ మాదిగ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన సతీష్ మాదిగకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ నాయకుల సంపూర్ణ మద్దతుతో పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సతీష్ మాదిగ మాట్లాడుతూ రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాలను, మాదిగలను సంఘటితం చేసి నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌తో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి కృషి చేస్తానని సతీష్ మాదిగ తెలిపారు.

## ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న పాలకులు..

**మాగనూరు,మార్చి 24 ప్రభాతవార్త :** మండలంలోని పలు గ్రామాలకు బిటి రోడ్లు నిర్మించలేక ప్రభుత్వం నీరు గారుస్తుంది. ప్రజల జీవితాలతో పాలకులు చెలగాటమాడుతున్నారు. రహదారి లేక మాగనూరు మండల పరిధిలోని పగడబండ గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గ్రామస్తులు కాపాడుకున్నారు. గ్రామానికి చెందిన యువకుడు ఇంటిదగ్గర గుండెపోటు రావడంతో వెంటనే స్థానికులు గమనించి అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడం జరిగింది. కానీ రోడ్లు గుంతలమయంగా ఉండడంతో అంబులెన్స్ రావడానికి సమయం పడుతుందని అక్కడున్న వ్యక్తులు ఆ వ్యక్తిని ద్విచక్ర వాహనంపై వడ్వాట్ గ్రామ శివారు దగ్గరికి తీసుకెళ్లి అక్కడ అంబులెన్స్‌లో తీసుకెళ్లడం జరిగింది. చికిత్స అందించి వెంటనే మహబూబ్‌నగర్ ఎస్‌విఎస్ ఆసుపత్రికి తరలించారు. పాలకులు ఎన్నో సంక్షేమపథకాలు అమలు పరుస్తామని పబ్బం గడుపుకుంటున్నారు.కాని గ్రామాలకు సరైన రోడ్లు, నీటి వసతి లేక ప్రజలు దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నారు. ఇటువంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకముందు ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కాటన్‌మిల్లులో భారీ అగ్నిప్రమాదం ..



**మాగనూరు,మార్చి 24 ప్రభాతవార్త :** వడ్వాట్ గ్రామ సమీపంలో ఉన్న బసవేశ్వర జిన్నింగ్, కాటన్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో మిల్లు కాలిబూడిదైంది. ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో మిల్లులు ఉన్న పత్తి బండల్స్, జిన్నింగ్ చేయడానికి తీసుకొచ్చిన విత్తనాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన పక్క రైస్‌మిల్లు కూలీలు యజమానికి విషయం తెలిపారు. దీంతో యజమాని వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. నారాయణపేట, మక్తల్ నుండి పెద్ద ఎత్తున ఫైర్ ఇంజిన్లు, ఇతర వాటర్ ట్యాంకర్లను రప్పించి మంటలు ఇతర మిల్లులకు వ్యాపించకుండా అదుపు చేశారు.మిల్లుతో పాటు జిన్నింగ్ కోసం తెచ్చిన విత్తనాలు, పత్తి పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ. 8 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు మిల్లు యాజమాన్యం తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని వివరాలు సేకరిస్తున్నారు.

## నైస్ సంస్థ ఆధ్వర్యంలో చెంచులకు ఫుడ్‌రైస్ పంపిణీ..

**లింగాల,మార్చి 24 ప్రభాతవార్త :** ఆరోగ్యాన్ని పెంపొందించుటకు మిల్లెట్స్ పొడర్‌తో పాటు, చెంచులకు ఫుడ్‌రైస్ పంపిణీ చేయడం జరిగిందని నైస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పూర్ణచందర్‌రావు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ఎర్రపెంట గ్రామంలో చెంచులకు ఫుడ్‌రైస్, మిల్లెట్స్ పొడర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నైస్ సంస్థ వ్యవస్థాపకులు పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ ఈ గ్రామం అభివృద్ధి కోసం నైస్ సంస్థ గతనెల నుంచి బాధ్యత తీసుకోవడం జరిగిందని, అందులో భాగంగా ఆదిత్య సంస్థ కూడా సహకారం అందిస్తుందని తెలిపారు. ఆదివారం 100 కుటుంబాలకు ఫుడ్‌రైస్ పంపిణీ చేశామని తెలిపారు. అదేవిధంగా 300ల మంది పౌష్టికాహారం విలువలతో కూడిన భోజనాలు పంపిణీ చేశామని తెలిపారు. ముందుగా గ్రామమంతా గ్రామస్థులచే శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఆర్టీడి టీం లీడర్ రాధమ్మ పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

**ఉప్పునుంతల,మార్చి 24 ప్రభాతవార్త :** మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కస్తూర్బా విద్యాలయం వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై లెనిన్ తెలిపారు. ఆదివారం ఉదయం ఎన్నికల నియమావళిలో భాగంగా వాహనాల తనిఖీల సందర్భంలో ఎలాంటి అనుమతి లేకుండా 12 బీర్ సీసాలను తరలిస్తున్న దేవదారికుంటకు చెందిన కాట్రవత్ పంతులు అనే వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.

## హోలీ పండుగలో నిబంధనలు పాటించాలి

**రాజాపూర్ ఎస్సై కె. రవి**

**రాజాపూర్,మార్చి 24 ప్రభాతవార్త :** రాజాపూర్ మండలంలోని ప్రజలు, యువకులు హోలీ పండుగను పోలీసుల సూచనలు పాటిస్తూ జరుపుకోవాలని సోమవారం జరుపుకునే హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తించరాదని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు జరుపుకోవాలని ఎస్సై రవి అన్నారు. ప్రజలు హోలీ ఆడేటప్పుడు కెమికల్స్‌కు రసాయన కలర్స్‌ను వాడరాదని, యువకులు అత్యుత్సాహం ప్రదర్శించరాదని, పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకొని వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హోలీరోజు పోలీస్ సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందని మద్యపానం సేవించి వాహనాలు నడిపితే చర్యలు నమోదు చేస్తామన్నారు.

# కళ్యాణం.. కమనీయం..!

## ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవం..

**ఉప్పునుంతల,మార్చి 24 ప్రభాతవార్త :** మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మధ్య కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వధువు తరపున, వరుడు తరపున కూర్చొని కళ్యాణాన్ని జరిపించారు. కళ్యాణానికి ముందు ఉదయం 8 గం.ల నుండి 12 గం.ల వరకు నిత్య హోమాలు, బలిహరణం, గరుడ వాహన సేవ, తీర్థ ప్రసాద వితరణ, మోహినిసేవ, భూతేశ్వరి మాతపూజ, ఉదయం 11 గం.లకు ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణతో పాటు అమ్రాబాద్ జడ్పీటిసి, అచ్చంపేట ఎమ్మెల్యే సతీమణి డా. చిక్కుడు అనురాధలు ముఖ్య అతిథులుగా హాజరు కావడంతో ఆలయ కమిటి ఛైర్మన్ మాధవరం రాజల్‌రావు, ఈఓ శ్రీనివాస్‌రావు, పాలక మండలి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు మేళ తాళాలతో ఆలయ ప్రాంగణంలో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో శ్రీలక్ష్మి నరసింహస్వామికి వేద పండితులచే ప్రత్యేక పూజలు జరిపించారు.తదుపరి ఆయనను ఆలయ కమిటి ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ, ఆయన సతీమణి డా. చిక్కుడు అనురాధ, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటి ఛైర్మన్ కందూరు సుధాకర్, మామిళ్లపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటి ఛైర్మన్ మాధవరం రాజల్‌రావు, ఈఓ శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచ్‌లు అనంత ఇంద్రసేనారెడ్డి, కాల్వ పుష్ప గోవర్ధన్‌రెడ్డి, కంసానిపల్లి మాజీ సర్పంచ్ కర్నె లక్ష్మీనారాయణ, మర్యాద దామోదర్, లక్ష్మి నరసింహస్వామి, ఆలయ కమిటి మాజీ ఛైర్మన్ మొకురాల రామస్వామిగౌడ్, పాలక మండలి సభ్యులు గణేష్‌గౌడ్, బాల్‌రావు, శేఖర్,ప్రవీణ్, ఆంజనేయులు, అర్చకులు విజయ రాఘవచారి, బిజినేపల్లి చక్రవర్తి శ్రీనివాసచార్యులు, త్రివెంగల చార్యులు, గోపాలచార్యులు, వరదరాజు అయ్యంగార్, శ్రీనివాసచార్యులు,



కుటుంబ సభ్యులతో కలిసి కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

నాగర్‌కర్నూల్ మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ వల్లభ్‌రెడ్డి, స్థానిక ఎంపిటిసి కడారి రామలక్ష్మమ్మ, దాసర్లపల్లి గ్రామానికి చెందిన గంగుల నరసింహారెడ్డి, మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

**ఉమామహేశ్వర స్వామి వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం...**

మామిళ్లపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించిన లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవానికి హాజరైన భక్తులకు శ్రీశైలం ఉత్తర ద్వారమైన శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం నిత్య అన్నదాన సత్రం నుంచి అన్నదాన కార్యక్రమ దేవస్థాన కమిటి ఛైర్మన్ కందూరు సుధాకర్, ఈఓ శ్రీనివాస్‌రావు, పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, అమ్రాబాద్ జడ్పీటిసి, సిపిఎం ట్రస్టు ఛైర్‌పర్సన్ డా. చిక్కుడు అనురాధలు ప్రారంభించారు.



లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



మామిళ్లపల్లిలో అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

# వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం..

**దైవ చింతనలోనే మానసిక ప్రశాంతత**

**జడ్పీటిసి మోహన్‌నాయక్,**

**ఎంపిటిసి సునిత శ్రీనివాస్‌నాయక్**

**భక్తి శ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు**



వెంకటేశ్వస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

**రాజాపూర్,మార్చి24 ప్రభాతవార్త :** వెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి కళ్యాణమహోత్సవం ఘనంగా నిర్వహించారు.దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జడ్పీటిసి సభ్యులు కాట్రావత్ మోహన్‌నాయక్, ఎంపిటిసి సభ్యులు విస్లావత్ సునిత శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు.ఆదివారం రాజాపూర్‌మండలంలోని సింగమ్మగూడ గ్రామపంచాయతీలో గల అంజమ్మగడ్డ తండాలో శ్రీ వెంకటేశ్వరస్వామి తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ఆవరణలో పలు ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని అప్పుడే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆలయంలో శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు అంజమ్మగడ్డ తండాలో ఇంటింటికి తిరుగుతూ ఉత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో హోమ కార్యక్రమాలు, స్వామివారి కళ్యాణం,భోగ్‌బండార్,స్వామివారి పల్లకిసేవ,గ్రామపురవీధులలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంజమ్మగడ్డ తండాతో పాటు పరిసర ప్రాంత తండాల గిరిజన మహిళలు, గిరిజన యువకులు, నాయకులు,భక్తులు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు..

**కబ్జా చేసిన భూములను నిరుపేదలకు పంపిణీ చేస్తాం..ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

**కొల్లాపూర్,మార్చి 24 ప్రభాతవార్త :** శ్రీశైలం ముంపు భూములకు అక్రమ పట్టాలు పొంది ప్రభుత్వ, ప్రజాధనాన్ని దుర్వినియోగపరుస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాపెంట్లవెల్లి మండలం మంచాలకట్ట గ్రామంలో మార్నింగ్‌వాక్‌లో భాగంగా మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకురావడం జరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంతో కృష్ణానదిలో పేదలకు చెందిన మునిగిపోయిన మునక భూములను కొందరు అక్రమార్కులు దౌర్జన్యంగా పేదల నుంచి లాక్కొని మళ్లీ తిరిగి పట్టా భూములుగా సృష్టించి ప్రభుత్వం నుండి అన్ని రాయితీలు పొందుతున్న అక్రమార్కుల భరత పడతామని త్వరలోనే ఆ భూములపై విచారణ చేపట్టి నిరుపేదలకు పంపిణీ చేస్తామని మంత్రి అన్నారు. సర్వే నం. 96లో సుమారు 80 ఎకరాల ను బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు వారి కుటుంబ సభ్యులు అక్రమాలకు పాల్పడ్డారని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మల్లేశ్వరం గ్రామ గుట్టలను పర్యాటక ప్రాంతంగా గుర్తించడానికి కృషి చేస్తానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎంఐఎం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు..

**మహబూబ్‌నగర్,మార్చి 24 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని షాలీమార్ ఫంక్షన్ హాలులో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ ఎంపి అసదుద్దిన్ ఓవైసితో కలిసి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పోరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌తో కలిసి సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితుడు మహబూబ్‌నగర్ ఎంపి అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒబేదుల్లా కొత్వాల్‌కు, అసదుద్దిన్ ఓవైసికి పండ్లు తినిపించారు. కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షబ్బీర్ అహ్మద్, ఎంఐఎం జిల్లా అధ్యక్షులు హాది, జిల్లా మైనార్టీ సెల్ ఛైర్మన్ ఫయాజ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి,ఎన్‌పి వెంకటేష్, జాకీర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, అజ్మత్ అలీ, జాబేరిబిన్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న నాయకులు



పండ్లు తినిపిస్తున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

## హస్తం గూటికి బాద్మి శివకుమార్ ?

**బిఆర్‌ఎస్ పార్టీకి బిగ్‌షాక్.. సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ముఖ్యనేత..**

**మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 24 ప్రభాతవార్త :** జడ్చర్ల నియోజకవర్గం టిఆర్‌ఎస్ కీలక నేత టిఆర్‌ఎస్‌ను వీడి హస్తం గూటికి చేరనున్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ ఛైర్మన్ బాద్మి శివకుమార్ బిఆర్‌ఎస్‌లోకి వెళుతున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. బిఆర్‌ఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన బాద్మి శివకుమార్‌కు జడ్చర్ల నియోజకవర్గంపై పట్టు ఉంది. సీనియర్ నేతగా కొనసాగుతున్న ఆయన పార్టీని వీడుతుండడంతో టిఆర్‌ఎస్‌కు బిగ్‌షాక్ తగలనుంది. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఢిల్లీ అధికార ప్రతినిధి జితెందర్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి సమక్షంలో ఆదివారం సీఎంను బాద్మి మర్యాదపూర్వకంగా కలిశారు.



సీఎంను కలిసి బాద్మి శివకుమార్, చిత్రంలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

## మక్తల్ పట్టణంలో బంగారం చోరీ..



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**మక్తల్,మార్చి 24 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో న్యూ రాఘవేంద్ర కాలనీలో విద్యుత్ శాఖ ప్రభుత్వ ఉద్యోగి మన్యంకొండ ఇంట్లో 12 తులాల బంగారం అపహరణకు గురైంది. ఎండాకాలం ఉండడం వల్ల రాత్రి ఇంటి తలుపులు తెరిచి ఉంచి నిద్రపోగా, గుర్తు తెలియని వ్యక్తులు బీరువాపై ఉన్న తాళాలను తీసుకొని బీరువాలో ఉన్న 12 తులాల బంగారం అపహరించుకుని వెళ్లిపోయారు. ఉదయం లేచి గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడం జరిగింది. స్థానిక సిఐ చంద్రశేఖర్, ఎస్సై వై.భాగ్యలక్ష్మిరెడ్డి వచ్చి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి..



**ఇటిక్యాల,మార్చి24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన చిన్నకృష్ణ(50) వడ దెబ్బ తగిలి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం ఉదయం గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి ఉపాధి పనులకు వెళ్లిన ఆయన వడదెబ్బకు గురికాగా గమనించిన కుటుంబ సభ్యులు గ్రామంలో ఆర్‌ఎంపి డాక్టర్ వద్ద చికిత్స తీసు కున్నారని రాత్రి పడుకున్న తర్వాత నిద్రలో ఆయన మృతి చెం దారని తెల్లవారుజామున చూడగా ఆయన మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య పిల్లలు ఉన్నట్లు ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సమాజ సేవకై ప్రతి ఆదివారం ఉచిత వైద్య శిబిరం..



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 24 ప్రభాతవార్త:**సమాజ సేవా చేయాల నే ఉద్దేశంతో ప్రతి ఆదివారం ఏదో ఒక గ్రా మంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లక్ష్మి చిన్న పిల్ల ల ఆసుపత్రి వై ద్యులు శ్రావణి, ఉదయ్‌కుమార్‌లు పేర్కొన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ మండలం తుడూకుర్తి గ్రామంలో లక్ష్మి చిన్న పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఇద్దరు పీడియాట్రిషన్ గైనకాలజిస్టులు కావడంతో గ్రామంలో మహిళలు, చిన్నారులకు ప్రత్యేకంగా వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి చూయించులేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ప్రతి ఆదివారం ఆసుపత్రి తరుపున వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

